క్లుప్తంగా

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

ఆర్మూర్‌టౌన్: వర్షాకాలం సమీపిస్తున్నందున సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య అన్నారు. పట్టణంలోని 23వ వార్డులో చేపడుతున్న పారిశుధ్య స్పెషల్‌డ్రైవ్ పనులను పరిశీలించారు. మురికి కాలువల్లో పేరుకుపోయిన పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. కాలువల ద్వారా వరద వెళ్లే విధంగా ఉండాలన్నారు. ప్రజలు చెత్తను మురికి కాలువల్లో కాకుండా ఇంటింటికి వచ్చే మున్సిపల్ వాహనాల్లో వేయాలని సూచించారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



రెంజల్: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని మండల ప్రత్యేకాధికారి వాజిద్‌హుస్సేన్ సూచించారు. మండలంలోని బోర్గాం, తాడ్‌బిలోలి, పేపర్‌మిల్, కందకుర్తి గ్రామాల్లోని పాఠశాలల్లో చేపడుతున్న పనులను స్థానిక అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలంటాలని పంచాయతీరాజ్ ఏఈకి సూచించారు. పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అధికారులు సమన్వయంతో పురోగతి సాధించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో గణేశ్‌రావు, ఏఈతో పాటు ఆయా గ్రామాల హెచ్‌ఎంలు ఉన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



నందిపేట్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఆయా పాఠశాలలకు సోమవారం పంపిణీ చేశారు. ఉమ్మడి నందిపేట మండలంలోని 59 ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి చదువుతున్న 5239 మంది ఇంగ్లిష్, తెలుగు మీడియం చదువుతున్న విద్యార్థులకు 70 వేల పుస్తకాల అవసరం. ఇందులో పాఠ్యపుస్తకాల ల్లో తెలుగు, ఇంగ్లిష్ పాఠ్యంశాలు ఒకే పుస్తకంలో రావడంతో మండలానికి పార్ట్–1, 2 కలిపి 35 వేల పుస్తకాలు వచ్చినట్లు మండల విద్యాధికారి పొద్దుటూరి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మిగతా పుస్తకాలు త్వరలో రానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సన్మానం



రెంజల్: ఇంటర్, పదో తరగతి ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన ఉత్తమ విద్యార్థులను గ్రామస్తులు సన్మానించారు. మండలంలోని బాగేపల్లికి చెందిన ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు అక్షర, సాయిచరణ్ 467 మార్కులు సాధించారు. వీరితో పాటు పదోతరగతిలో 9.7 జీపీఏ సాధించిన మానసను మాజీ సర్పంచ్ పాముల సాయిలు ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సాయాగౌడ్, గోపాల్, ఉపాధ్యాయులు సతీశ్, గంగాధర్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో అన్నదానం

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో మధ్యాహ్న భోజనం కార్యక్రమాన్ని జిల్లా జడ్జి సునీత కుంచాల సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. ప్రతి సోమవారం జిల్లా కోర్టుకు వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో వారికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఇందూరు యువత ప్రారంభిస్తుందన్నారు. దీనికి అందరు సహకరించాలని తెలిపారు. సీనియర్ జడ్జి పద్మావతి, డీఎల్ఎస్ఏ సూపరింటెండెంట్ పురుషోత్తంగౌడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

లా హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు

నిజామాబాద్‌అర్బన్: రాష్ట్రంలోని లా ఎంట్రెన్స్ పరీక్ష కేంద్రాల వద్ద లా సబ్ కమిటీల ఆధ్వర్యంలో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ కన్వీనర్ రాచకొండ విగ్నేష్ మాట్లాడుతూ.. సెంటర్ల వద్ద విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడం కోసం, అదేవిధంగా వారి ర్యాంకుల వివరాలు తెలుసుకోవడం, సమస్యల పరిష్కారం కోసం హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిజామాబాద్ జిల్లాలోని నాలెడ్జ్ పార్క్ ఇంటర్నేషనల్ స్కూల్ వద్ద, క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల వద్ద, వీఆర్‌ఈసీలో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు మహేష్, ఉపాధ్యక్షురాలు దీపిక, నగర అధ్యక్షుడు గణేష్, ప్రసాద్, సతీష్, ప్రవీణ్ ఉన్నారు.

లెక్కల్లోనే మొక్కలు

- పట్టణ సుందరీకరణ పేరుతో రూ. లక్షల వ్యయం
- నాటిన హరితహారం మొక్కలు ఎండిపోయిన పరిస్థితి



పిప్రి రోడ్డులో ఎండిపోయిన మొక్కలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణాన్ని సుందరీకరణ చేస్తాం.. హరితహారంలో నాటిన మొక్కలతో పచ్చ దనం ఒట్టిపడేలా చేస్తామన్న అధికారుల మాటలు ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. ప్రతి ఏడాది హరితహారంలో భాగంగా మొక్కలు నాటా లని లక్ష్యాన్ని నిర్దేశిస్తూ రూ. లక్షల్లో ఖర్చు చేస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అంతంగానే ఉంటోంది. పట్టణంలోని పలు చోట్ల, ప్రధాన రహదారుల గుండా నాటిన మొక్కలకు ఎలాంటి సంరక్షణ చర్యలు చేపట్టకపోవడంతో కొద్ది కాలానికే అవి కనుమరుగవుతున్నాయి. లెక్కల్లో వంద శాతం లక్ష్యం సాధించామని చెబుతున్న అధికారులు బిల్లులు మాత్రం పక్కాగా పెడుతున్నారు. కానీ నాటిన చోట్ల మొక్కలు కనిపించడం లేదు. గతంలో నాటిన చోట మళ్లీ హరితహారం కార్యక్రమం నిర్వహించారు. కంచెలు ఏర్పాటు చేయకపోవడం, నీరు సరిగా పట్టకపోవడంతో మొక్కలన్నీ మాయమయ్యాయి. కొన్ని చోట్ల ప్లాస్టిక్ కవర్లు తీయకుండానే గుంతల్లో నిర్లక్ష్యంగా పడేశారు. పెరిగిన కాసిన్ని మొక్కలు సైతం మూగ జీవాలకు ఆహారంగా మారుతున్నాయి. అధికారులు నాటిన మొక్కలు 20 శాతం వృక్షాలుగా మారిన దాఖలాలు లేవు. దీంతో పురప్రజలు అధికారుల పాలకవర్గాల తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పట్టణంలోని జిరాయత్‌నగర్ నుంచి దారిలో నాటిన మొక్కల ప్రాంతాల్లో మొక్కలు కనిపించడం లేదు. కట్టెలు మాత్రమే ఉన్నాయి. ప్రధాన రహదారుల గుండా నాటిన హరితహారం మొక్కలు ఎండిపోవడంతో కనిపించకుండా పోతున్నాయి. మెప్మా ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి 6 మొక్కలు అందజేశారు. కానీ నాటిన దాఖలాలు లేవు. అధికారులు ఇంటి యజమానులకు మొక్కలు అందించి చేతులు దులుపుకొన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రక్షణ చర్యలు తీసుకుంటాం



మున్సిపల్ పరిధిలో నాటిన మొక్కలను పర్యవేక్షణ చేసి ప్రతిరోజు నీరు అందేలా చర్యలు తీసుకుంటాం. ఎండిన మొక్కల చోట నూతన మొక్కలను నాటుతాం. ఇకపై ప్రత్యేకంగా వాటి సంరక్షణపై దృష్టిపెడతాం.
– రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

‘తెలంగాణపై సీఎం రేవంత్‌ది చిన్నచూపు’



నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా

నిజామాబాద్‌నాగారం: తెలంగాణను సీఎం రేవంత్ రెడ్డి చిన్నచూపు చూస్తున్నారని అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేశ్‌బిగాల, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. నగరంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకల ముగింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా గణేశ్‌గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నట్లు తెలిపారు. తెలంగాణ చరిత్ర ఆనవాళ్లు లేకుండా చేసేందుకు రాజముద్రను తయారు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం ఇప్పటివరకు రైతుబంధు, భరోసా ఇవ్వకుండా రైతుల ఆత్మహత్యలకు కారణమవుతున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ భారీ మెజార్టీతో గెలువనుందని తెలిపారు.

కార్యక్రమంలో మేయర్ దండు నీతూకిరణ్, సిర్పరాజు, మాజీ నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సుజిత్‌సింగ్ ఠాకూర్, సత్య ప్రకాష్, ఎనగందుల మురళి తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలను పరిష్కరించాలి



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సుభాష్‌నగర్: జిల్లాలోని రైతాంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పాట్కూరి తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏవో ప్రశాంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పాట్కూరి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. వానాకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలన్నారు. కొన్ని జిల్లాల్లో విత్తనాల కొరతతో పాటు నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. విత్తనాల కొరత లేకుండా చూడాలని, నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్‌చేశారు. రూ.2 లక్షల రుణమాఫీ సీజన్ ప్రారంభం కాకముందే చేయాలన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర కార్యవర్గసభ్యుడు భరత్‌భూషణ్, అంతరెడ్డి హరీష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహ్రెయిన్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు



బహ్రెయిన్‌లో తెలంగాణ వాసులు

మోర్తాడ్: బహ్రెయిన్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఆది, సోమవారాల్లో తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలను కొనసాగించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు గువ్వలపల్లి వెంకటస్వామి, కొత్తపల్లి రాజశేఖర్, డాక్టర్ ప్రేం సాగర్, శివకుమార్, పయ్యావుల శ్రీనివాస్, ఆలె గంగాధర్, సంజీవ్, వాసుదేవారావు, ఎస్ శ్రీనివాస్ గుప్తా, కిరణ్‌కుమార్, కోటగిరి నవీన్‌కుమార్, గంగుల సుదర్శన్, మధుకర్ నాయిని, బోగ సత్యం, దీకొండ శ్యామ్‌ప్రసాద్, బోగ నాగరాజు, బాలే పరమేశ్వర్, బాలే శ్రీధర్, అన్నారం సుమన్, కాసుల సుమన్, వేముల కృష్ణ, వేముల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె



సుభాష్‌నగర్: తమ సమస్యల పరిష్కారం కోసం గ్యాస్ డెలివరీ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం 8వ రోజు కొనసాగింది. ఈసందర్భంగా ఎన్టీఆర్ చౌరస్తాలో సమ్మె చేస్తున్న హెచ్‌పీ గ్యాస్ కార్మికులకు, ఇండియన్ గ్యాస్ కార్మికులు సంఘీభావం తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి ఓమయ్య మాట్లాడుతూ.. 8 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా.. యాజమాన్యం, కార్మికశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. నాయకులు హన్మండ్లు, గ్యాస్ ఏజెన్సీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సాయన్న, కోశాధికారి రవికుమార్, శివకుమార్, నయీమ్, గంగాధర్, ప్రసాద్, రాజు కార్మికుల తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

ధర్పల్లి: ధర్పల్లి మండల వ్యవసాయ శాఖ అధికారిగా రవీందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏవోగా పనిచేసిన ప్రవీణ్ కుమార్ ఇటీవల మృతి చెందాడు. దీంతో మోపాల్ ఏవోగా పనిచేస్తున్న రవీందర్ బదిలీపై ఇక్కడికి వచ్చాడు. ఈ సందర్భంగా ఏవో రవీందర్ మాట్లాడుతూ.. రైతులకు వానాకాలం పంటలకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు అన్ని సొసైటీలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

బడిబాటను విజయవంతం చేయాలి

ఇందల్వాయి: బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్న నేపథ్యంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాల పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌ల ద్వారా పుస్తకాలు పాఠశాలలకు చేరవేస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా సోమవారం పలు పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఎంఈవో మాట్లాడుతూ.. బడిబాట కార్యక్రమం విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



పిల్లమారి సుధాకర్

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని ఓం పద్మశాలీ విజయ సంఘం నూతన కార్యవర్గం సోమవారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా పిల్లమారి సుధాకర్, ఉపాధ్యక్షుడిగా చింత హన్మంతు, కార్యదర్శిగా చింత హన్మాండ్లు, కోశాధికారిగా అడిచెర్ల రాజు, దైవశెట్టిగా వన్నెల్‌దాస్ భాగ్యరాజ్, కార్యవర్గ సభ్యులుగా పెండెం మినేశ్, పిల్లమారి రవి, చిలివేరి గంగాప్రసాద్, చింత సత్యపాల్, సురుకుట్ల నరేశ్, బొడ్డు రాజారాం, బొడ్డు అరవింద్, అడిచెర్ల రజనీకాంత్ ఎన్నికయ్యారు.

■ **లయన్స్ క్లబ్..**



ఆర్మూర్‌టౌన్: పట్టణ కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం నూతన కార్యవర్గం సోమవారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా చెరుకు పృథ్వీరాజ్, కార్యదర్శిగా మ్యాక శ్రీకాంత్, కోశాధికారిగా చెట్లపల్లి నారాయణగౌడ్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులను సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు రాజన్న, రఫీ గోహార్, అంబల్ల తిరుపతి, నరసింహారెడ్డి, జ్ఞానిచావ్లా, బిజ్జు సంతోష్, చెన్న రవికుమార్, ఉదయ్ కుమార్, అశ్విన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృథాగా మిషన్ భగీరథ నీరు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జిరాయత్‌నగర్‌లో ఉన్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌లో నీరు నింపే పైప్‌లైన్ పై భాగంలో కొన్ని నెలల క్రితం లీకేజీ ఏర్పడింది. దీంతో నాటి నుంచి నీరు వృథాగా పోతోంది. అయినా అధికారులు స్పందించడం లేదు. ఒకవైపు తాగు నీటి సమస్యతో ఇబ్బంది పడుతుంటే మరోవైపు అధికారుల నిర్లక్ష్యంతో మిషన్ భగీరథ నీరు వృథాగా పోతోందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పైప్‌నకు మరమ్మతులు చేపట్టి లీకేజీ కాకుండా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అక్రమ పట్టాలు రద్దు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కమ్మర్‌పల్లి: తమ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 73లోని అక్రమ పట్టాలను రద్దు చేయాలని మండలంలోని అమీర్‌నగర్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ ఆంజనేయులుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చౌట్‌పల్లికి చెందిన మారు శంకర్, కొమ్ముల వెంకన్న, బద్దం రాజేశ్వర్, కొట్టాల రాజేశ్వర్‌లు సర్వే నంబర్ 73లో అక్రమంగా పట్టాలు చేయించుకున్నారని ఆరోపించారు. ఆ భూముల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసుకున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రకాశ్ నాయక్, భూమారెడ్డి, శర్మన్‌నాయక్, ముత్తెన్న, గంగారెడ్డి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

■ **శివాలయంలో ప్రత్యేక పూజలు**



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలో భక్తులు సోమవా రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయంలో పంచామృతాలతో అభిషేకాలు చేశా రు. భక్తులు రామాలయం, దుర్గామాత, దత్తాత్రేయ, అయ్య ప్ప, ఎల్లమ్మతల్లి, హనుమాన్, ఏకశిల స్తంభాన్ని భక్తులు సందర్శించారు. నందీశ్వర మహారాజ్ స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. పల్లకీసేవ చేపట్టారు. కార్యక్రమంలో బి సుమన్, పీసీ గంగారెడ్డి, మల్లయ్య, హజారి సతీశ్, కొంతం మంజుల మురళి తదితరులు పాల్గొన్నారు.

■ **రుద్రూర్‌లో..**

రుద్రూర్: మండల కేంద్రంలోని రుక్మిణి పాండురంగ విఠలేశ్వర స్వామి ఆలయంలో వైశాఖ మాస ద్వాదశి పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ పునః



నిర్మాణం చేసినప్పటి నుంచి ప్రతి ద్వాదశి రోజున అన్నదానం నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు చిదుర వీరేశం తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కర్క అశోక్, కొలాస్ గంగాధర్, విజయ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

■ **ఘనంగా బీరప్ప కల్యాణం**



మాక్లూర్: మండలంలోని ఒడ్డేటిపల్లిలో ఉన్న బీరప్ప ఆలయంలో కుర్మ సంఘం సభ్యులు స్వామివారి కల్యాణాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా దేవత విగ్రహ మూర్తులను ఊరేగింపు చేపట్టారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు బూరోళ్ల అశోక్, ఎస్ పోతన్న, ఆశన్న, రామడల్లా రాజేశ్వర్, ప్రవీణ్, జనార్దన్ పాల్గొన్నారు.

యూనిఫాంలు అందించాలి



పెర్కిట్: ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభానికి ఏకరూప దుస్తులు అందేలా చూడాలని డీఆర్డీవో సాయాగౌడ్ ఐకేపీ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంతో పాటు మండలంలోని పిప్రిలో మహిళా సంఘాలచే కుడుతున్న ఏకరూప దుస్తులను సోమవారం పరిశీలించారు. పాఠశాలలు ఈ నెల 12న ప్రారంభవుతున్నందున కుట్టు పనిని త్వరగా పూర్తి చేయాలన్నారు. పనిలో నాణ్యత పాటించాలన్నారు. ఆయన వెంట ఏపీఎం గంగారాం, సీసీ కల్పన, వీవోఏలు స్రవంతి, రాజమణి, సభ్యులు ఉన్నారు.

ప్రథమ చికిత్స కేంద్రాల పరిశీలన



ఎడపల్లి: మండలంలోని ప్రథమ చికిత్స కేంద్రాలను జిల్లా వైద్యశాఖ అధికారులు సోమవారం పరిశీలించారు. గ్రామంలో మలేరియా, డయేరియా, టీబీ, పలు రోగాలపై ఆరా తీశారు. ప్రథమ చికిత్స కేంద్రాల్లో పని చేస్తున్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట డాక్టర్ సాయిస్తా సిద్దోస్, సూపర్‌వైజర్ దేవేందర్, సిబ్బంది ఉన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	లవ్‌మీ (తెలుగు) – 12.05, 6.15 ఫ్యూరియోసా (తెలుగు) – 3.00 హిట్‌లిస్ట్ (తెలుగు) – 9.10
స్క్రీన్-2 –	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (తెలుగు) – 10.00, 1.05, 4.10, 7.15, 10.20
స్క్రీన్-3 –	గంగం గణేశా (తెలుగు) – 12.15, 3.20, 6.25, 9.30
స్క్రీన్-4 –	భజే వాయువేగం – 10.35, 1.30, 4.25, 7.20, 10.15

నిషేధం ఉన్నా.. అమలేది?



జిల్లా కేంద్రంలోకి వచ్చిన భారీ వాహనం

- నగరంలో ఉదయం నుంచి రాత్రి వరకు భారీ వాహనాలకు నో ఎంట్రీ
- అయినా యథేచ్ఛగా రాకపోకలు
- పట్టించుకోని అధికారులు

నిజామాబాద్ రూరల్: నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి గతంలోనే అధికారులు భారీ వాహనాలకు ప్రవేశం నిషేధించారు. నగరంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వాటిని ప్రవేశం లేదు. కానీ నిబంధనలను పట్టించుకోకుండా భారీ వాహనాల డ్రైవర్లు యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నారు. ఈక్రమంలో ఇరుకు దారుల్లో భారీ వాహనాలు వెళ్లడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. అలాగే రోడ్లపై ఇష్టానుసారంగా భారీ వాహనాలను నిలిపిఉంచడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అయినా అధికారులెవరూ పట్టించుకోకపోవడంపై నగరవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లా కేంద్రంలోని పూలాంగ్ చౌరస్తా, పాత కలెక్టర్ కార్యాలయం, ఎన్టీఆర్ చౌరస్తా, కంఠేశ్వర్ బైపాస్, దుబ్బ రోడ్డు, వీక్లీ బజార్, పెద్ద బజార్, హైమత్‌పుర కాలనీ, ఖిల్లా రోడ్లల్లో అనుమతులు లేకుండా టిప్పర్లు, లారీలు వంటి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈక్రమంలో భారీ వాహనం నిలిపిఉంచితే గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతుంది. నగరానికి చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలు నుంచి జిల్లా కేంద్రానికి చేరుకోవడానికి తక్కువ సమయం పడుతున్నా.. జిల్లా కేంద్రానికి వచ్చాక వాహనాల రద్దీతో గమ్యస్థానాన్ని చేరుకోవడానికి ఎక్కువ సమయం పడుతుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భారీ వాహనాలను జిల్లా కేంద్రానికి రాకుండా చర్యలు చేపట్టి, బైపాస్ గుండా వెళ్లేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఉత్తమ విద్యుత్ ఉద్యోగులకు అవార్డు



ఆర్మూర్‌టౌన్/ పెర్కిట్: ఆర్మూర్ విద్యుత్ కార్యాలయంలో ఉత్తమ విద్యుత్ ఉద్యోగులను ట్రాన్స్‌కో డీఈ హరిచంద్ నాయక్ సోమవారం సన్మానించారు. ప్రతి నెల ఉమ్మడి జిల్లాలో ఉత్తమ విద్యుత్ ఉద్యోగులను ఎన్నుకొని అవార్డుతో సత్కరిస్తున్నారు. అందులో భాగంగా ఆర్మూర్ ఏడీఈ శ్రీధర్, ఏఈ అశ్రితరెడ్డి, లైన్‌మన్ శివకుమార్ ఉత్తమ ఉద్యోగులుగా ఎన్నికయ్యారు. అనంతరం వీరిని ట్రాన్స్‌కో డీఈ హరిచంద్‌నాయక్ సన్మానించి అభినందనలు తెలిపారు.